క్లుప్తంగా

ఆదర్శ పాఠశాలకు ఆర్టీసీ బస్సు నడపాలి

క్రోసూరు: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థుల రాకపోకలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రవిబాబు కోరారు. శుక్రవారం సీపీఎం ఊటుకూరు గ్రామ మహాసభ గర్నెపూడి సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి బాబు మాట్లాడారు. మండలంలోని బయ్యవరం, ఊటుకూరు విప్పర్ల ఇతర గ్రామాల నుంచి విద్యార్థులు క్రోసూరు మోడల్ స్కూల్లో విద్యను అభ్యసించడానికి వెళ్తున్నట్లు చెప్పారు. గుంటూరు, పిడుగురాళ్ల నుంచి క్రోసూరు వస్తున్న బస్సులు మోడల్ స్కూల్ వద్దకు వెళ్లకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొళాయిల ఏర్పాటుకు సిమెంట్ రోడ్లను పగలగొట్టి వదిలేస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, గ్రామ నాయకులు శాఖమూరి మోహనరావు, గారా నాగరాజు గంజిమాల ఎలిశమ్మ పాల్గొన్నారు.

చైతన్య కళాస్రవంతి వ్యవస్థాపక కార్యదర్శి అప్పారావు మృతి



సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన చైతన్య కళాస్రవంతి వ్యవస్థాపక కార్యదర్శి, గౌరవ సలహాదారు, ప్రముఖ రంగస్థల సినీ రచయిత, దర్శకుడు, నటుడు రామరాజు వెంకట అప్పారావు (68) మృతి చెందారు. గత ఐదు రోజులుగా అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతుడికి భార్య అంజలి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రామరాజు వెంకట అప్పారావు కళారంగంలోనూ, డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తూ అందరికీ సుపరిచితుడు. డాక్యుమెంట్ రైటర్లు, పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

గుండెపోటుతో విద్యుత్ ఏడీఈ బాబ్జీనాయక్ మృతి



రాజుపాలెం: మండలంలోని కొండమోడు జంక్షన్‌లోని విద్యుత్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎం.బాబ్జీనాయక్ గుండెపోటుతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. గుండెనొప్పి రావడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఆయనను చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

మద్యం దుకాణాలకు 289 దరఖాస్తులు

సత్తెనపల్లి: నూతన మద్యం దుకాణాలకు సత్తెనపల్లి సర్కిల్ నుంచి 289 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సత్తెనపల్లి సర్కిల్ పరిధిలోని 15 మద్యం దుకాణాలకు రూ.5.78 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం లభించిందన్నారు. ఈ నెల 14న ఉదయం 8 గంటలకు నరసరావుపేటలోని ప్రకాష్ నగర్ టౌన్ హాల్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు లాటరీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు.

ఆలస్యంగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్

సత్తెనపల్లి: జన్మభూమి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం 1.50 గంటలు ఆలస్యంగా నడిచింది. విశాఖపట్నం నుంచి సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 1:55 గంటలకు రావలసిన రైలు 3.45 గంటలకు చేరుకుంది. దీంతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వంట నూనెల విక్రయ కౌంటర్ ప్రారంభం

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని మల్లమ్మ సెంటర్‌లో గల విజయ గణపతి ఆయిల్ మర్చంట్స్, శివుని బొమ్మ సెంటర్‌లోని మహాలక్ష్మి రోటరీ ఆయిల్స్‌లో వంట నూనెల ప్రత్యేక కౌంటర్‌ను శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ప్రారంభించారు. పాకెట్ పామాయిల్ ధర రూ.110లకు, సన్‌ఫ్లవర్ ఆయిల్ పాకెట్ రూ.124లకు విక్రయించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కావున తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి మూడు పాకెట్లు పామాయిల్, ఒక పాకెట్ సన్ ఫ్లవర్ ఆయిల్ ఇవ్వటం జరుగుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌వో నారదముని, సీఎస్‌డీటీ టి.కొండారెడ్డి ఆయిల్ మిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో యువకుడి ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పనసతోటకు చెందిన షేక్ సలీం (35) అదే ప్రాంతంలోని మీసేవ వద్ద గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.



చేజర్ల గ్రామంలో మహిషాసురమర్దని



సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గా పీఠంలో మహిషాసురమర్దని



సత్తెనపల్లి: వెంకటపతి కాలనీలో మహిషాసురమర్దని




సత్తెనపల్లి:శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో మహిషాసురమర్దని



సత్తెనపల్లి: వద్దవల్లి బొడ్డురాయి సెంటర్‌లో మహిషాసురమర్దని



సత్తెనపల్లి: పెదమక్కెన లో మహిషాసురమర్దని




ముప్పాళ్ళ: నార్నెపాడులో మహిషాసురమర్దనిగా అమ్మవారు



అచ్చంపేటలో కాళికాదేవిగా వాసవీమాత



అచ్చంపేట: వీరలక్ష్మి దేవి అలంకరణలో



మహిషాసురమర్దనిగా క్రోసూరు వాసవీ అమ్మవారు

జయ జయహే .. మహిషాసురమర్దని

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దని రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–సత్తెనపల్లి

ప్రశాంతంగా దసరా పండగ



క్రోసూరు: మండల ప్రజలు దసరా పండగ ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. దొడ్లేరు, హసనాబాద్, నాగవరం గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. దసర సంబరాలకు డీజేలు పెట్టొద్దని చెప్పారు. లాటరీల జోలికి వెళ్లొద్దన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆయన వెంట సీఐ సురేష్, ఎస్ఐ నాగేంద్రరావు, సిబ్బంది ఉన్నారు.

ఇంటిలో చోరీ



తొండపి(ముప్పాళ్ళ): ఎవరూ లేని సమయంలో ఇంటిలోని బీరువా పగలకొట్టి బంగారు నగలు అపహరించిన ఘటన గురువారం రాత్రి తొండపి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు షేక్ మొఘల్ నాగూల్ వివరాల మేరకు.. దసరా సెలవులు కావటంతో కొడుకుని తీసుకొని నాగూల్ భార్య పుట్టింటికి వెళ్లింది. సత్తెనపల్లిలో కార్పెంట్ పని ముగించుకొని ఇంటికి వచ్చిన నాగూల్ పక్కనే ఉన్న తల్లిదండ్రుల వద్దకు నిద్రించేందుకు వెళ్లాడు. తెల్లారి ఇంటికి వచ్చేసరికి తాళం పగలకొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా కూడా తెరిచి ఉండటాన్ని గమనించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సుమారు పది సవర్ల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిపించి దర్యాప్తు చేపట్టారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ భారం తగ్గుదల

పథకం జిల్లా నోడల్ అధికారి సింగయ్య



జిల్లా నోడల్ అధికారి సింగయ్య, పక్కన ఎస్ఈ, ఏడీఈ

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ బిజ్లీ పథకాన్ని ప్రవేశ పెట్టిందని పీఎం సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి సింగయ్య అన్నారు. సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న గో సంరక్షణ శాల కల్యాణ మండపంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులతో శుక్రవారం అవగాహనా సమావేశం నిర్వహించారు. సింగయ్య మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారంతో పాటు శిలాజ ఇంధన వినియోగం తగ్గించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. ఇంటి పైకప్పు(రూఫ్‌టాప్) పై సౌర పలకలు ఏర్పాటు చేసుకొని ఆ ఇంటి అవసరాలకు తగ్గట్టు అక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చునన్నారు. దీనికోసం ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. ఒక కిలోవాటుకు సోలార్ పలకల ఏర్పాటు కోసం ఇంటి పైకప్పులో 100 చదరపు అడుగుల ఖాళీ స్థలం ఉండాలన్నారు. గరిష్ఠంగా 500 కేవీ సోలార్ విద్యుత్తుకు రాయితీ ఇస్తారని చెప్పారు. వ్యక్తిగత గృహాలు మాదిరిగా కాకుండా కిలోవాట్‌కు రూ.18 వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుందన్నారు. మిగతా సొమ్ము బ్యాంకు నుంచి రుణం తీసుకోవచ్చు అన్నారు. జిల్లా ఎస్ఈ పత్తిపాటి విజయ్ కుమార్ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసుకునేలా కమిటీలకు అవగాహన కల్పించి,సోలార్ వైపు ఆసక్తి చూపేలా ప్రయత్నించాలన్నారు. ఏడీఈ కె.రాజశేఖర్‌బాబు వ్యక్తిగత గృహాలకు సోలార్ పలకల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. సమావేశంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు, విద్యుత్ ఉద్యో గులు, సిబ్బంది, ఉన్నారు.

'మేత' లేకుండా ఇసుక మేస్తున్నారు

- ఊరలంకలో అక్రమ ఇసుక తవ్వకాలు
- పసుగ్రాసం మట్టి పొర తొలగించి మరీ రవాణా



మునగోడు కృష్ణానది ఊరలంకలో భారీ గోతులతో ఇసుక తవ్వకాలు

అమరావతి: మండల పరిధిలోని మునగోడు కృష్ణా నదిలో ఊరలంక ప్రదేశాన్ని అక్రమ ఇసుక రవాణాదారులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారని, అధికారులు వెంటనే అపాలని ఆ గ్రామ సర్పంచ్ బంకా విష్ణు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పశువుల మేతకు వెళ్లే భూమిలో పెద్ద పెద్ద గుంతలు తీస్తున్నారన్నారు. గతంలో మునగోడు ఇసుక రీచ్‌లో పడవలతో నది మధ్యలో తవ్వకాలు చేపట్టారని చెప్పారు. ప్రస్తుతం ఊరలంకలో సుమారు రెండు అడుగుల మట్టి పొరను తొలగించి అడుగున ఉన్న ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటన్నారన్నారు. సుమారు వంద ఎకరాల ఊరలంక ఎస్సీ కాలనీలో 88 మంది వాటాదారులున్నారని..ఏటా పశుగ్రాసం కోసం బహిరంగ వేలం పాట పెట్టి వచ్చిన సొమ్మును కాలనీవాసులు పంచుకుంటారని తెలిపారు. గ్రామంలోని పశువుల మేత కోసం వినియోగించే ఊరలంకను ఇష్టారాజ్యంగా పెద్ద గుంతలు తవ్వి.. ఇసుకను తరలించుకుపోవడంపై అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే ఊరలంకలో అక్రమ ఇసుక రవాణా అపాలని లేకుంటే, కాలనీవాసుల ఉమ్మడి అస్తిని కాపాడుకోవటానికి జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యం

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా అని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం రతన్ టాటా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూప్ సంస్థలను దశాబ్దాలుగా నిబద్ధతతో నిర్వహించిన పద్మవిభూషణ్ రతన్ టాటా సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. టాటా గ్రూప్ ఉత్పాదనలు వాడని భారతీయులు ఉండరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, జాన్ బాబు, కొల్లా వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



దాచేపల్లి : బాలికలను తప్పనిసరిగా చదివించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రత్నకుమారి చెప్పారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. దాచేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ రత్నకుమారి మాట్లాడుతూ.. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండేంత వరకు పెళ్లి చేయకుండా చదివించాలని, ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబమంతా వెలుగులో ఉంటుందని చెప్పారు. బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం కల్పించిన అవకాశలను అందిపుచ్చుకుని ఉన్నతమైన చదువులు బాలికలు చదవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారు లేక బేజారు

- దళారుల బెడద తప్పలేదంటున్న అన్నదాతలు
- చొరవ చూపని పాలకులు, అధికారులు
- ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో గాడితప్పిన లక్ష్యం



ఏఎంసీ ఆవరణలో అలంకారప్రాయంగా తాత్కాలిక రైతు బజారు



మూతబడిన ఎస్టేట్ అధికారి కార్యాలయం

సత్తెనపల్లి: పంట పండించడం ఎంత కష్టమో.. పండిన పంటను అమ్ముకోవడం కూడా రైతులకు మరింత కష్టంగా మారింది. అటు రైతులకు.. ఇటు వినియోగదారులకు ఉభయతారకంగా వెలుగొందాల్సిన రైతు బజారు అలంకారప్రాయంగా మారింది. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల మండలాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రైతులకు సత్తెనపల్లి ప్రధాన వ్యాపార కేంద్రం. ఇక్కడ రైతు బజారు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో రైతులు కోరుతున్నారు. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. రైతు బజారు లేకపోవడంతో పంట ఉత్పత్తులను రైతులు సత్తెనపల్లిలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇక్కడ కూడా వ్యాపారులు చెప్పిందే వేదంగా నడుస్తోంది. వాళ్లు నిర్ణయించిందే ధర.. వేసిందే తూకమని రైతులు వాపోతున్నారు.

అలంకారప్రాయంగా రైతు బజారు

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక వైపు దాదాపు 8 ఏళ్ల క్రితం తాత్కాలిక రైతు బజారును ఏర్పాటు చేశారు. త్వరలో రైతు బజారుకు ప్రత్యేక స్థలం కేటాయించి పక్కా భవనంతో పాటు రైతులు విశ్రాంతి తీసుకునేందుకు మరికొన్ని గదులు ఏర్పాటు చేస్తామని అప్పట్లో నాయకులు, అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి దాకా ఆ హామీ అమలుకు నోచుకోలేదు. అప్పట్లో 12 దుకాణాలను తాత్కాలిక రైతు బజారులో ఏర్పాటు చేయగా.. పర్యవేక్షణకు ఎస్టేట్ అధికారిని, సెక్యూరిటీ గార్డ్‌ని సైతం నియ మించారు. కాలక్రమంలో పాలకులు, అధికారులు తాత్కాలిక రైతు బజారును పట్టించుకోవడం మానేశారు. దీంతో రైతులు పంట ఉత్పత్తులను ఇక్కడికి తీసుకురావడం ఆపేశారు. 10 దుకాణాలు మూతబడ్డాయి. ఎస్టేట్ అధికారిని, సెక్యూరిటీ గార్డ్‌ను కూడా తొలగించారు. కేవలం రెండు దుకాణదారులు మాత్రం హోల్‌సేల్‌గా కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి వాటిని తాత్కాలిక రైతు బజారులో అందుబాటులో ఉంచి రిటైల్ వ్యాపారం సాగిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రజలకు ధరల సెగ

కూరగాయలు మార్కెట్లో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసే ధరలు తక్కువగా ఉంటున్నాయి. అదే కూరగాయలను తిరిగి అధిక రేట్లకు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. దీంతో వ్యాపారులు లాభాలు గడిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడంతో పాటు ప్రజలకు ధరల సెగ తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రైతులు, వినియోగదారులకు మేలు చేకూరేలా రైతు బజారును అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

10న రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ ప్రారంభం

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన రెడ్‌క్రాసు బ్లడ్‌సెంటర్‌ను నవంబరు పదో తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకు శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన బ్లడ్‌సెంటర్‌ను సందర్శించి మాట్లాడారు. జిల్లా వైద్యశాల 200 పడకల సామర్థ్యం కలిగి ఉందని, పేద ప్రజలకు రోగులందరికీ సేవలు అందిస్తుందని అన్నారు. బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తులమురళి, డాక్టర్ రెహమతుల్లా, డాక్టర్ సృజన, శ్రీనివాసగుప్తా, బ్లడ్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళిధర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును సమీక్షించాలి


మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అరుణ్ కుమార్



మాట్లాడుతున్న అరుణ్ కుమార్, గోదాజాన్‌పాల్

సత్తెనపల్లి: ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు పునఃపరిశీలించాలని మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్ బాబు అధ్యక్షతన శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. మాల మహానాడు జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు గోళ్ళ అరుణ్‌కుమార్, గోదా జాన్‌పాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో ఈ తీర్పు వచ్చిందని మాలలు, ప్రజాస్వామ్య వాదులు ప్రజాక్షేత్రంలో మన పోరాటానికి పిలుపునివ్వాలన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ప్రదర్శన చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మాలే పద్మారావు, ప్రధాన కార్యదర్శిగా మనికే మహేష్, పట్టణ గౌరవాధ్యక్షుడిగా కాటుమాల ప్రభాకర్, పట్టణ ఉపాధ్యక్షుడిగా పైర్ల జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జూపల్లి జోసఫ్, కార్యదర్శిగా కొనతం ప్రసన్నకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని కీలక నాయకులు పాల్గొన్నారు.

జగదంబకు అక్షరాకృతి



వినుకొండ (నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు బి.ప్రసాద్ విజయదశమి సందర్భంగా చిత్రం గీశారు. నుదుటిపై బొట్టులో ఓం అనే అక్షరంతో ముక్కు మీద దుర్గాదేవి అక్షరాలు పెదవిపై దసరా అని తలపై విజయదశమి అని కంఠంపైన శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రీకరించారు. ఆయనను పలువురు అభినందించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: వివాహిత మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఆమె మృతికి భర్త కుటుంబ సభ్యుల వేధింపులే కారణమంటూ మృతురాలి బంధువులు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన కొమ్ము సౌజన్య (25)కు నరసరావుపేటకు చెందిన ఆర్లగడ్డ ఏసుబాబుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి స్థానిక కంభంపాలెంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సౌజన్య మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్ ఒగ్గెకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు వైద్యశాల వద్దకు చేరుకున్నారు. తన కుమార్తె మృతికి అత్త, మరిది వేధింపులే కారణమంటూ తండ్రి కొమ్ము నాగరాజు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.